భక్తజన సందోహం.. పాతబస్తీ బోనాలు

నగరంలో ఆషాఢ మాసం బోనాలలో భాగంగా ఆదివారం లాల్ దర్వాజ, ఇంకా పలు చోట్ల బోనాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, సోమవారం పాతబస్తీ లాల్‌దర్వాజ పరిధుల్లో రంగం, బలిగంప, గావు పట్టుట మొదలైన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రధానంగా తొట్టెల ఊరేగింపు, అంబారిపై అమ్మవారి ఊరేగింపు, భక్తులకు అమ్మవారి సేవ మొదలైనవి భక్తిశ్రద్ధలతో జనరంజకంగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఊరేగింపు జరగగా, కళాకారులు చిత్ర విచిత్ర వేషధారణతో భక్తులను ఆకట్టుకున్నారు. కనుల పండువగా జరిగిన అంబారి శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద పెట్టున తరలివచ్చారు. తొట్టెలను గణేశ్ ఘాట్ వరకు భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పారిశుధ్యం మరీ.. అధ్వాన్నం

నగరంలో పారిశుధ్య విలువలు కొరవడ్డాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, వ్యర్థాలతో కూడుకొని నగరమంతా దుర్గంధంలో కొట్టు మిట్టాడుతోంది. గత పదేండ్లలో ఏనాడు లేని వ్యర్థాలు నగర వీధులు, గల్లీలు, బస్తీలలో తాండవం చేస్తున్నాయి. దీంతో నగరం యావత్తు దుర్వాసనలు, వ్యర్థాల నీటి ప్రవాహంతో ఈగలు, దోమలు ముసురుకొని ప్రజల ఆవాసానికి ఆటంకంగా తయారయ్యాయి. జన జీవనానికి ప్రధాన అవరోధంగా దాపురించాయి. ఇలాంటి వాతావరణంలో ఏ రోగం వచ్చి ఎట్లా ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని నగర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అసలే.. వర్షాకాలం కావడంతో ఎక్కడ ఎలాంటి చెత్త వేసినా.. ఇట్లే దుర్గంధం పుట్టుకొస్తుంది. వీటి ద్వారా పురుగు, పుట్రా పుట్టుకొచ్చి జనాలకు రోగకారకాలుగా నిలవనున్నాయి. ఇలాంటి పరిస్థితులు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. పాలకులు, అధికార యంత్రాంగానికి మాత్రం పట్టదు. వారి కండ్లకు ఇవి కనిపించే పరిస్థితి లేదు. కాచిగూడ (కుబ్జిగూడ) పరిధిలో కొన్ని రోజులుగా వీధులలో వ్యర్థాలు వికటాట్టాసం చేస్తున్నాయి. ఏం.. పాలనా యంత్రాంగమో.. ఏమో..!

బ్రాహ్మణులకు అదనంగా రూ.200 కోట్లు కేటాయించాలి

బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న మునిపల్లె శ్రీనివాస్

ఆర్కేపురం, జూలై 29: బ్రాహ్మణుల సంక్షేమం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్లో రూ.50 కోట్లు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ బ్రహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. ఆర్కేపురం డివిజన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా విదేశీ విద్య చదువుకుంటున్న బ్రహ్మణ విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్పులు, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అదనంగా కనీసం రూ.200 కోట్లు కేటాయించి బ్రహ్మణులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర మూర్తి, ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, బానగిరి నాగరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించరూ..

జూబ్లీహిల్స్ రోడ్ నం.70 సమస్యపై ఫిర్యాదు చేసిన సినీ నటుడు రాజశేఖర్

జూబ్లీహిల్స్, జూలై 29: నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్డు నం.70లో మురుగు నీటి సమస్యపై ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజశేఖర్ ఎక్స్ వేదికగా జీహెచ్ఎంసీ పాలకులు, అధికారులకు ట్వీట్ చేశారు. గత కొంత కాలంగా స్థానిక అశ్విని హైట్స్ సమీపంలో ఈ డ్రైనేజీ లీకేజీ సమస్య నెలకొందని ఆయన పేర్కొన్నారు. సమస్యకు పరిష్కారం కోరుతూ చాలాకాలం క్రితం జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశానేని, అయినప్పటికీ, సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ ఆన్‌లైన్‌లకు ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను ట్వీట్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని రాజశేఖర్ కోరారు.

గ్రేటర్‌లో పలు చోట్ల వర్షం

మరో రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, జూలై 29 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం సాయంత్రం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసింది. రాత్రి 9.30 గంటల వరకు మచ్చబొల్లారంలో అత్యధికంగా 3.33సెం.మీలు, లంగర్‌హౌస్‌లో 9.3మి.మీలు, గోల్కొండ, మలక్‌పేట్‌లో 6.3మి.మీలు, గోషామహల్‌లో 4.8మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు తెలిపారు. ఆవర్తనం కొనసాగుతుండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వానలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా గ్రేటర్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.0 డిగ్రీలు, గాలిలో తేమ 66 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పోస్టల్ సేవలకు సత్కారం

పోస్టల్ శాఖలో అద్భుత పనితీరు కనబరిచిన 98 మంది పోస్టల్ ఉద్యోగులను చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి సోమవారం సత్కరించారు. గత ఏడాది ఆర్థిక సంవత్సరానికి గాను వారందించిన సేవలను ఆయన ప్రశంసించారు. తెలంగాణలో 6,267 పోస్ట్ ఆఫీసుల్లో 15,086 అధికారుల కృషితో రూ.543 కోట్ల ఆదాయం సమకూరింది. పోస్టల్‌లో అందుతున్న వివిధ సేవలపై పీవీఎస్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత, హైదరాబాద్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ బి.అరుముఘం, డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ సాయి పల్లవి పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, జూలై 29;



ముఖేశ్ గౌడ్‌కు నివాళి

దివంగత మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ ఐదో వర్ధంతిని నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి మురళీధర్ తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి సోమవారం వికారాబాద్ జిల్లా ఆర్టీసీ డిపోలో 'నిధి ఆప్కే నిఖత్ 2.0' పేరిట క్యాంప్ నిర్వహించారు. ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్‌బాబు సమస్యలు, పుట్టిన తేదీ తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ప్రైస్టేజ్ ఎంప్లాయీస్ సభ్యుడు మల్లేశం ప్రసంగించారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

– వికారాబాద్, జూలై 29

ఉద్యోగ బదిలీలను వెంటనే చేపట్టాలి

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్

చిక్కడపల్లి, జూలై 29: తెలంగాణ వ్యవసాయ శాఖలో దీర్ఘకాలికంగా వేచి చూస్తున్న ఉద్యోగుల బదిలీలను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం కార్యవర్గ సమావేశాన్ని సోమమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వైద్యనాథ్ మాట్లాడుతూ, జీవో ఎంఎస్-80 ప్రకారం, నిష్పక్ష పాతంగా బదిలీలు చేపట్టాలని దీర్ఘకాలికంగా మండలాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా బదిలీలు నిర్వహించాలని ఆయన కోరారు. ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన చెందిన జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మంద కృష్ణ మౌనం వీడాలి

- మాదిగల ఓట్లతోనే బీజేపీకి ఎనిమిది సీట్లు
- 8, 9న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

ఖైరతాబాద్, జూలై 29: ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ మౌనం వీడాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్నారని, రెండో సారి వచ్చిన తర్వాత కూడా ఆ అంశాన్ని పక్కన పెట్టారన్నారు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ వర్గీకరణ పేరుతో మరోసారి మభ్యపెట్టారన్నారు. మందకృష్ణ మాదిగ బీజేపీకి మాదిగల ఓట్లు వేయించారని, వారి ఓట్లతోనే రాష్ట్రంలో ఎనిమిది సీట్లు గెలిచిందన్నారు. ప్రస్తుతం, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో వర్గీకరణ బిల్లును ఎందుకు పెట్టడం లేదన్నారు. మాదిగల ఓట్లు వేయించుకున్న ఇక్కడి బీజేపీ ఎంపీలు సైతం మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లోపు వర్గీకరణ బిల్లు పెట్టకుంటే ఆగస్టు 8, 9 తేదీల్లో జంతర్ మంతర్ వేదికగా, పెద్ద ఎత్తున మాదిగలతో కలిసి మహాధర్నా, నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో మాదిగ రాజకీయ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఒక్కలగడ్డ చంద్రశేఖర్, జాతీయ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బుదాల బాబురావు, మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బీఎన్ రమేశ్, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్నీ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొగులయ్య, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్, మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షులు మహేశ్, విజయలక్ష్మి, సముద్రాల ప్రశాంత్, దేవరకొండ నరేశ్, జోగు గణేశ్, లింగంపల్లి మధుకర్, కృష్ణ పాల్గొన్నారు.

నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జీతాలు పెంచాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఎంప్లాయీస్ యూనియన్ వినతి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రాంబాబు యాదవ్, సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

చిక్కడపల్లి, జూలై 29: నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జీతాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని నిమ్స్ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ అధ్యక్షుడు, సంఘం గౌరవ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శేరందాస్ గోవర్ధన్‌లు మాట్లాడారు. 30 ఏండ్లు నిమ్స్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. గత పదేండ్ల నుంచి 30 ఏండ్లకు పైబడి పనిచేస్తున్న కార్మికులకు ఈ రోజు డ్యూటీలో చేరిన కార్మికులకు ఒకే వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. 10 ఏండ్లు పై బడిన సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేకంగా జీతాలు పెంచాలని కోరారు. మిగితా సమస్యలు కూడా పరిష్కారానికి కృషి చేయాలన్నారు.